క్లుప్తంగా

నేడు లక్ష్మీగణపతి వార్షిక కల్యాణ మహోత్సవం

సీతంపేట: సీతంపేటలో సిద్ధి, బుద్ధి సమేత లక్ష్మీగణపతి వార్షిక కల్యాణ మహోత్సవం గురువారం నిర్వహించడానికి ఆలయ కమిటీ నిర్ణయించింది. దీనిలో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు వేమకోటి సాయికృష్ణ శర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, ప్రధాన స్తంభ ప్రతిష్ఠ, అభిషేకాలు, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం కల్యాణం జరపనున్నారు.

కామర్స్ డిగ్రీతో ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న కామర్స్ లెక్చరర్ రాజ్యలక్ష్మి

సీతంపేట: కామర్స్ డిగ్రీతో మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని పాలకొండ డిగ్రీ కళాశాల కామర్స్ లెక్చరర్ రాజ్యలక్ష్మి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చర్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కెరీర్ గైడెన్స్ అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవనజ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్, అధ్యాపకులు రమేష్, తవుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఈసీ

జియ్యమ్మవలస: మండలంలోని ఉపాధి పనులను ఉపాధి హామీ ఈసీ తేజేశ్వరరావు బుధవారం పరిశీలించారు. అల్లువాడలో ఎర్ర చెరువును పరిశీలించి ఉపాధి వేతనదారులకు పలు సూచనలు చేశారు. తప్పుడు మస్తర్లు నింపిన వారిపై తగు చర్యలుంటాయన్నారు. ఫీల్డ్ అసిస్టెంటులు ఎటువంటి అక్రమాలకు పాల్పడినా తగు చర్యలు ఉంటాయన్నారు. వేతనదారులు సమయపాలన పాటించి కొలతల ప్రకారం పనులు చేస్తే వేతనాలు ఎక్కువ పొందవచ్చన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

భామిని: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో టెన్త్, ఇంటర్ సెకండియర్ విద్యార్థుల ఫేర్‌వెల్ డే కార్యక్రమం బుధవారం ఉల్లాసంగా.. ఉత్సాహంగా నిర్వహించారు. పీఎంసీ కమిటీ చైర్‌పర్సన్ నిమ్మలకుమారి, వైస్ చైర్మన్ సత్యనారాయణ సాంత్రోల అధ్యక్షతన ప్రిన్సిపాల్ రఘుపాత్రుని శివకుమార్ పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది. విద్యార్థుల నృత్యాలు అలరించాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుట్టిన ప్రతి బిడ్డకు టీకా



టీకాలపై ఆరా తీస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి జగన్‌మోహనరావు

వీరఘట్టం: పుట్టిన ప్రతీ బిడ్డకు వెంటనే టీకాలు వేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్‌మోహనరావు సూచించారు. బుధవారం ఆయన వీరఘట్టం, బిటివాడ పీహెచ్‌సీల పరిధిలో కొన్ని గ్రామాల్లో పర్యటించి టీకా వివరాలను తెలుసుకున్నారు. చిన్న పిల్లల టీకా నిర్వహణ ప్రణాళికా బద్ధంగా చేపట్టాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. అనంతరం ఏయే గ్రామాల్లో ఎంత మందికి టీకాలు వేశారో ఎంసీపీ కార్డులు తనిఖీ చేశారు. ఆయనతో పాటు డాక్టర్లు కె.ఉమామహేశ్వరి, ఎ.మనీషా తదితరులున్నారు.

నీటి ఎద్దడి నివారణకు ప్రజాప్రతినిధుల చర్యలు

భామిని: మండలంలోని సొలికిరి, బాలేరు గ్రామాల్లో నెలకొన్న నీటి ఎద్దడి నివారణకు ప్రజాప్రతినిధులు నడుం బిగించారు. మార్చి నెల రావడంతో పాటు ఎండలు కూడా ఎక్కువ కావడంతో నీటి సమస్య పలుచోట్ల నెలకొంది. వంశధార నదిలో నీటి మట్టం క్రమేణ తగ్గిపోతుంది. దీంతో ప్రజల నీటి అవసరాలు తీరడం లేదు. దీన్ని తీర్చేందుకు బాలేరు ఎంపీటీసీ కొత్తకోట చంద్రశేఖర్, సర్పంచ్ జామి ప్రభాకర్ నడుం కట్టారు. వంశధార నదిలో ప్రజల అవసరాలకు అనువుగా నీటి తరలింపు చేపట్టారు. జేసీబీలతో వంశధార నదిలో ఇసుకను గట్టుగా వేసి నీటి ప్రవాహాన్ని తాత్కాలికంగా బుధవారం దారి మళ్లించారు. నీటి అవసరాల తీర్చేందుకు చర్యలు చేపట్టడంతో ప్రజాప్రతినిధులకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

లేఅవుట్లను పరిశీలించిన రెవెన్యూ అధికారులు

- అనుమతుల్లేకుండా విక్రయాలు
- ప్రభుత్వ భూముల కబ్జా గుర్తింపు
- రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఇష్టారాజ్యం



కురుపాం పంచాయతీ పూతికవలస సమీపంలో లేఅవుట్‌ను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

కురుపాం: కురుపాం పంచాయతీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా భూముల కన్వర్షన్స్ లేకుండా లేఅవుట్లు వేస్తున్నట్టు రెవెన్యూ అధికారులు గుర్తించారు. అదే సమయంలో ప్రభుత్వ భూములను కొంత మేర కబ్జా చేసి లేఅవుట్లను వేసి కొనుగోలుదారులను మోసం చేసినట్టు అందిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు బుధవారం సంబంధిత భూములను పరిశీలించారు. సర్వే చేశారు. పూతికవలస, కస్పాగదబవలస, సాయిబాబా ఆలయం సమీపంలో, గౌడు వీధి వెనుక ఉన్న లేఅవుట్, లెప్రసి ఆస్పత్రి సమీపంలో, రావాడ రోడ్డు తదితర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు వేసి లేఅవుట్లను రెవెన్యూ శాఖకు చెందిన ఆర్ఐ ప్రసాద్, సర్వేయరు రవికుమార్, సచివాలయ సర్వేయర్లు కలిసి అన్ని లేఅవుట్లను పరిశీలించి సర్వే చేపట్టారు. వీరు సర్వే చేసిన భూముల్లో చాలా వరకు కన్వర్షన్స్ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లు వేయడం, ప్రభుత్వ భూములను కబ్జా చేసినట్టు అధికారులు గుర్తించినట్టు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన లేఅవుట్లను గుర్తించిన వీరు సంబంధిత సర్వే నంబర్లను కూడా రికార్డుల మేరకు గుర్తించారు. సంబంధిత వివరాలను నివేదికల రూపంలో ఉన్నతాధికారులకు సర్వే నంబర్లతో అందజేయనున్నట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా కురుపాం పంచాయతీ పరిధిలో కొద్ది రోజులుగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ ఇష్టారాజ్యంగా ఎటువంటి ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటిపై రెవెన్యూ అధికారులు మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని స్థానికులు సూచిస్తున్నారు.

పింఛన్ల పంపిణీ



ఉల్లిబద్రలో పింఛన్లను అందజేస్తున్న వలంటీర్

గరుగుబిల్లి: మండలంలోని గరుగుబిల్లి, పెద్దూరు, ఉల్లిబద్ర, రావుపల్లి, రావివలస తదితర గ్రామాలలో ఇంటింటికి గ్రామ వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు వెళ్లి వైఎస్సార్ సామాజిక పింఛన్‌లను బుధవారం పంపిణీ చేయడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. మండలంలోని 25 పంచాయతీలలో ఉదయం నుంచే పింఛన్‌ల పంపిణీ చేయడంతో గ్రామాల్లో సందడి ఏర్పడింది. పింఛన్‌ల పంపిణీని ఎంపీడీఓ పైడితల్లి, తహసీల్దార్ రఫీజాన్‌లు పరిశీలించారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ



కురుపాం: సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రమేష్‌కుమార్

కురుపాం: బూత్ లెవెల్ అధికారులు(బీఎల్‌ఓ) ఈ నెల 6వ తేదీలోగా ఎమ్మెల్సీ ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి చేయాలని కురుపాం తహసీల్దార్ ఆర్.రమేష్ కుమార్ సూచించారు. తన కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారులతో ఆయన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ బీఎల్‌ఓ తమ పరిధిలో ఉన్న ఎమ్మెల్సీ ఓటరు స్లిప్పులను సంబంధిత ఓటరుకు అందజేయాలని, ఓటింగ్‌లో పాల్గొనేటప్పుడు గుర్తింపు కార్డు, ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఆర్ఐ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ సువర్ణ, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

భామినిలో...

భామిని: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం సిద్ధం చేసిన పట్టభద్రులకు నేరుగా ఓటర్ స్లిప్పులు అందించాలని బీఎల్‌ఓలకు తహసీల్దార్ నీలాపు అప్పారావు అన్నారు. తన కార్యాలయంలో బీఎల్‌ఓలతో ఆయన బుధవారం సమావేశమయ్యారు. పట్టభద్రుల ఓటర్ల జాబితా మేరకు నేరుగా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అందించి కౌంటర్ ఫైల్ కార్యాలయానికి అందించాలన్నారు. డీటీ నిమ్మల శేఖరం, సీనియర్ సహాయకుడు రామయ్య తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురంలో...

గుమ్మలక్ష్మీపురం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ స్లిప్పులను పట్టభద్రులకు అందజేస్తున్నట్లు మండల తహసీల్దార్ జె.రాములమ్మ తెలిపారు. బుధవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. బీఎల్‌ఓలు పట్టభద్రుల ఇంటి వద్దకే వెళ్లి ఓటర్ స్లిప్పులను అందజేస్తారని, ఈ నెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

న్యాయమూర్తిగా రోహిణిరావు



న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన రోహిణిరావు

కురుపాం: స్థానిక ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు నూతన న్యాయమూర్తిగా మద్ది రోహిణిరావు బుధవారం పదవీ బాధ్యతలను చేపట్టారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి న్యాయమూర్తిగా ఉన్న పార్వతీపురం జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డి.సౌజన్య నుండి చార్జ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు, న్యాయ సేవలు ప్రజలకు చేరువ చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన న్యాయమూర్తికి బార్ అసోషియేషన్ అధ్యక్షుడు నల్ల శ్రీనివాసరావు, న్యాయవాదులు బరాటం చంద్రమౌళి, వి.కుమార్‌స్వామి, ఐ.వాసుదేవరావు, కె.సూర్యనారాయణ, సోమయాజులు శుభాకాంక్షలు తెలిపారు.

గురుకుల పాఠశాల పరిశీలన



బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో కిచెన్ గార్డెన్‌ను పరిశీలిస్తున్న డీసీఓ

కొమరాడ: మండల కేంద్రంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల ఉమ్మడి సమన్వయ కర్త (డీసీఓ)బి.చంద్రావతి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, భోజనశాల పరిసరాలు పరిశీలించారు. ఉపాధ్యాయుల రికార్డులు, పరీక్ష పత్రాలు పరిశీలించారు. పబ్లిక్ పరీక్షలు రాయబోయే టెన్త్, ఇంటర్ విద్యార్థులకు సూచనలు చేశారు. నేషనల్ లెవెల్ ఒలింపియాడ్ నిర్వహించిన పరీక్షలో ఎంపికైన విద్యార్థులకు అభినందించారు. పాఠశాలలో నిర్వహించిన ఫేర్‌వెల్ డే కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు సూచనలు చేశారు. కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు. ఈమె వెంట ప్రిన్సిపాల్ రజనికుమారి, బోధన, బోధనేతర సిబ్బంది ఉన్నారు.

పశువుల పాక దగ్ధం



మంటల్లో కాలిపోయిన పశువుల పాక

పాలకొండ: మండలంలోని చింతాడ గ్రామంలో బుధవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో జరిగిన అగ్ని ప్రమాదంలో పశువుల పాక దగ్ధమైంది. గ్రామానికి చెందిన వావిలపల్లి జనార్దనరావుకు చెందిన పశువుల శాల కాలిపోవడంతో అందులో ఉన్న ఎద్దులు 50 శాతం మేర కాలిపోయాయి. పాకలో సమీపంలో ఉన్న టైరు బండి కూడా కాలిపోవడంతో రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపు చేశారు. పశువులకు వైద్య చికిత్సలు అందించారు. సర్పంచ్ దుప్పాడ కళావతి, వీఆర్‌ఓ ప్రవీణ్‌లు సంఘటనా స్థలం పరిశీలించి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

కరాటే విజేతలకు అభినందనలు



మెడల్స్, ప్రశంసాపత్రాలతో విజేతలైన విద్యార్థులు

భామిని: మండలంలోని గురండి విద్యా వికాస్ విద్యార్థులు పార్వతీపురం మన్యం జిల్లా స్థాయి కరాటే పోటీలలో విజేతలుగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై ప్రిన్సిపాల్ ఎం.గాంధీరాజు, టీచర్లు విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో బుధవారం అభినందించారు. జిల్లా స్థాయి కరాటేలో గోల్డ్ మెడల్స్ సాధించిన చిన్ని తేజాస్, దామోదర మణికంఠ(9వ తరగతి). మజ్జి సాయి(8వ తరగతి), సిల్వర్ మెడల్స్ సాధించిన ముగడ జగదీస్(8వ తరగతి), ఆనెం యశ్వంత్ కుమార్(9వ తరగతి)లను అభినందించారు.

నీటి ఎద్దడి నివారణ చర్యలు



మాట్లాడుతున్న ఈఓపీఆర్‌డీ సత్యం

సీతంపేట: వేసవి నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టనున్నట్టు ఈఓపీఆర్‌డీ కొండపల్లి సత్యం అన్నారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలన్నారు. బోర్లు వంటివి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు.

● రామాలయ పునః ప్రతిష్ఠ పూజలు



కడకెల్లలో జరుగుతున్న రామాలయ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న 500 మంది దంపతులు

వీరఘట్టం: మండలంలోని కడకెల్ల గ్రామంలో ఇటీవల నూతనంగా నిర్మించిన రామాలయ ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం కనుల పండువగా బుధవారం జరిగింది. గతంలో ఓ చిన్న గదిలా ఉండే రామమందిరాన్ని తొలగించి రూ.50 లక్షల వ్యయంతో గ్రామస్తులు నూతనంగా ఇటీవల రామమందిరాన్ని నిర్మించారు, ఈ ఆలయంలో సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ప్రముఖ యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్.శర్మయాజీ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ప్రతిష్ఠలో భాగంగా గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో 500 మంది దంపతులు పాల్గొన్నారు. సాయంత్రం సీతా, రామ లక్ష్మణ ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. మూడు రోజుల పాటు కార్యక్రమాలు జరగనున్నాయి.

మేలు రకం చింతపండు సేకరించాలి



పెదశాఖలో చింతపండు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎం

కొమరాడ: గిరిజనులు మేలు రకం చింతపండును సేకరించి ప్రభుత్వం కల్పించే గిట్టుబాటు ధర తీసుకోవాలని జీసీసీ డీఎం వి.మహేంద్రకుమార్ అన్నారు. మండలంలోని పెదశాఖలో చింతపండు కొనుగోలు కేంద్రాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో చింతపండు ధర తక్కువగా ఉన్నప్పటికీ గిరిజనులను ఆర్థికంగా ఆదుకోవడం కోసం ప్రభుత్వం మద్దతు ధర కేజీ రూ.32.40లకు కొనుగోలు చేసేందుకు నిర్ణయించిందన్నారు. చింతపండు విక్రయించిన వెంటనే నగదు అందజేస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట జీసీసీ సిబ్బంది ఉన్నారు.

హైరిస్క్ గర్భిణుల కోసం ప్రత్యేక చర్యలు

● డీఐఓ జగన్‌మోహన్‌రావు



గర్భిణుల పర్యవేక్షణపై అవగాహన కల్పిస్తున్న డీఐఓ జగన్‌మోహన్‌రావు

పాలకొండ: తల్లీబిడ్డల రక్షణే లక్ష్యంగా ప్రభుత్వం వైద్య సేవలు అందిస్తుందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(వ్యాధి నిరోధక టీకాలు) జగన్‌మోహన్‌రావు తెలిపారు. అన్నవరం పీహెచ్‌సీలో సిబ్బందికి ఇమ్యునైజేషన్‌పై బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల్లో గర్భిణులకు అందించాల్సిన వైద్య సేవలు వివరించారు. ఏఎన్ఎంలు ప్రతి రోజు చేయాల్సిన పరీక్షలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. అనంతరం నగర పంచాయతీలో ఎస్టీ వసతిగృహంలో జరుగుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య రంగానికి ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు. ఇందులో భాగంగా గర్భిణులకు ఎటువంటి సమస్యలు లేకుండా ముందు నుంచి పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. ఇదే సమయంలో చిన్నారుల ఆరోగ్యం కోసం చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆయనతో పాటు పీహెచ్‌సీ వైద్యాధికారి కమలనాథ్ ఉన్నారు.

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి

సీతంపేట: చలో ఢిల్లీ కార్యక్రమం ఏప్రిల్ 5న నిర్వహించనున్నట్టు సీఐటీయూ జిల్లా కార్యదర్శి దావాల రమణరావు అన్నారు. స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ అధిపతులకు దాసోహమై సామాన్యులను, రైతాంగాన్ని, కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. కోట్లాది మంది రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానాన్ని ప్రవేశపెట్టి ఉద్యోగ భద్రత లేకుండా చేసిందన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ నాయకులు ఎస్.సురేష్, కార్యదర్శి ఎం.కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం



క్రాష్ ప్రోగ్రాం వ్యాన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్యామల

కొమరాడ: గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టామని ఎంపీపీ శెట్టి శ్యామల అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో క్రాష్ ప్రోగ్రాంకు సంబంధించిన వ్యాన్‌ను ఆమె బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో ఎక్కువగా బోరు బావులు మరమ్మతులకు గురవుతున్నాయని వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎల్.అప్పారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నవీన్ కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డి.జనార్ధనరావు, సీనియర్ నాయకుడు డాక్టర్ శెట్టి మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

సదరం శిబిరంలో వైద్య పరీక్షలు



సదరం శిబిరంలో తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యుడు

కురుపాం: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం సదరం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్య పరీక్షలు చేశారు. ధ్రువపత్రాలను పరిశీలించారు. శిబిరంలో పార్వతీపురం ఏరియా ఆస్పత్రి వైద్యులు పీవీ శేషగిరిరావు పరీక్షలు నిర్వహించారు. సదరం శిబిరానికి వచ్చే వారు తప్పనిసరిగా చికిత్స పొందిన ధ్రువపత్రాలు తీసుకురావాలని సూచించారు.

ఎన్నికల నిర్వహణలో అప్రమత్తం



బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహిస్తున్న తహసీల్దార్

పాలకొండ: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో బీఎల్‌ఓలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు అన్నారు. మండలంలోని బీఎల్‌ఓలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల వారీగా ఓటర్ల జాబితాలను బీఎల్‌ఓలకు అందజేశారు. నేరుగా ఓటరుకు స్లిప్‌లు అందించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వివరాలను ఓటర్లకు తెలియజేయాలని సూచించారు. ఎక్కడా పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయనతో పాటు డీటీ బుచ్చయ్య ఉన్నారు.

టెన్త్, ఇంటర్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

● ఏటీడబ్ల్యూఓ సురేష్‌కుమార్



కేజీబీవీలో పాఠ్యాంశాల ప్రణాళికలు పరిశీలిస్తున్న ఏటీడబ్ల్యూఓ

గుమ్మలక్ష్మీపురం: మరి కొద్ది రోజుల్లో పబ్లిక్ పరీక్షలు రాయనున్న పదో తరగతి, ఇంటర్మీడియెట్ ఫస్ట్, సెకండియర్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని గుమ్మలక్ష్మీపురం సహాయ గిరిజన సంక్షేమాధికారి సురేష్‌కుమార్ అన్నారు. గుమ్మలక్ష్మీపురంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యోగుల హాజరు, ఉపాధ్యాయులు పాఠ్యాంశాల ప్రణాళికలు, టీచింగ్ డైరీ, మార్కుల రిజిస్టర్లతో పాటు స్టోర్‌లో సరుకుల నిల్వలు, వాటి నాణ్యతలను పరిశీలన చేశారు. అనంతరం ఆయన ఆ పాఠశాలలోని ఉపాధ్యాయినిలతో మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలంటే భయం వీడేలా టెన్త్ మరియు ఇంటర్ విద్యార్థినిలకు ప్రోత్సాహాన్ని అందివ్వాలంటూ సూచనలు చేశారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీరంజని ఉన్నారు.

నిర్దిష్టమైన పనివేళలు కేటాయించాలి



వెలగవాడలో వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పాలకొండ రూరల్: వేసవి నేపథ్యంలో ఉపాధి పనులకు నిర్దిష్టమైన పని వేళలు కేటాయించాలని ఎంపీడీఓ డొంక త్రినాధులు అన్నారు. పాలకొండ మండలం అన్నవరం, వెలగవాడ గ్రామాల్లో జరుగుతున్న ఓనిగెడ్డ చానల్, పలు చెరువుల పనులు బుధవారం పరిశీలించారు. వేతనదారుల, ఉపాధి క్షేత్ర సిబ్బంది హాజరు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముందస్తుగానే కొలతలు, పని గంటలు కేటాయించాలన్నారు. ఎండల తీవ్రతల నేపథ్యంలో వృద్ధులకు, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గుర్తించి పనులు ఇవ్వకుండా జాగ్రత్త పడాలన్నారు. ఈ క్రమంలో వేతనదారులకు పలు సూచనలు చేశారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

పాలకొండ రూరల్: మండలంలోని అట్టలి గ్రామంలో తాగునీటి సమస్యలపై సర్పంచ్ కె.సంధ్య స్పందించారు. గ్రామంలో తాగునీటి చేతి బోరు మరమ్మతులకు గురికావటం, వేసవి సమీపిస్తుండటంతో వలంటీర్లకు సూచనలు చేశారు. బుధవారం బోరుకు మరమ్మతులు చేయించారు. గ్రామంలో నీటి వనరుల అభివృద్ధి, నీటి బావుల్లో క్లోరినేషన్ చేయించాలని సూచించారు.